"కడదాకా నిన్నే కలవరిస్తూ కన్నుమూసిందిరా. ఓ గంట ముందొచ్చుంటే అమ్మ కోరిక తీరేది. ఆమె చివరి చూపులు నీకు దక్కి ఉండేవి'' తమ్ముణ్ణి పట్టుకుని భోరుమన్నాడు గోపాలం.

మాతృమూర్తి మరణవార్త విని కుప్పలా కూలిపోయాడు సుబ్బారావు.

అతడి నోట మాట రావడం లేదు. అంతా తననో నేరస్థుడిలా చూస్తున్నారు.

"కన్నతల్లి మంచాన ఉందని తెలిసినా నీకు రావడానికి తీరిక లేకుండా పోయిందా!'' చీవాట్లేస్తూన్నట్లున్నాయి వాళ్ల చూపులు.

పోయేముందు అమ్మనోమారు చూడలేకపోయినందుకు తనను తాను తిట్టుకున్నాడు. ఇప్పుడేమనుకుని ఏం లాభం? తీరు మార్చుకోమని సన్నిహితులు సలహాలిస్తే పెడచెవిన పెట్టాడు. కేవలం పబ్బం గడుపుకోడానికే ప్రాధాన్యతనిచ్చాడు. అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. అంతా తను చేసుకున్నదే. లేకపోతే మరేంటి? తల్లిచావు బ్రతుకుల్లో ఉందంటే సెలవు దొరకదా?

* * *

సుబ్బారావు ఆ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్. ఈమధ్య పాత ఆఫీసర్ ట్రాన్స్‌ఫర్ అయితే మరో చండశాసనుడు వచ్చి ఆ సీట్లో కూలబడ్డాడు. అతడొచ్చిన దగ్గర నుండి సిబ్బందికి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఎంత అర్జంటున్నా సెలవివ్వడం లేదని ఒకడు, పర్మిషన్ అడిగితే కసురుకుంటున్నాడని మరొకడు..బాస్‌ని తిట్టుకోనివారు లేరు.

జూనియర్ అసిస్టెంట్ జగన్నాధం సెలవు చీటీ పట్టుకుని బాస్‌రూంలోకెళ్లడం గమనించిన సుబ్బారావు "చూస్తూండు వాడు వెర్రిమొహం వేసుకుని రాకపోతే ఒట్టు'' అన్నాడు కొలీగ్ కాంతారావుతో.

# ఆలస్యం

## -దూరి వెంకటరావు

అతడన్నట్లుగానే రెండు నిముషాల్లో మొహం వేలాడేసుకుని బయటకు వచ్చాడు జగన్నాథం.

"పాపం రేపు వాడి మ్యారేజ్ డే. భార్యతో సరదాగా ఎటైనా వెళ్దామనుకున్నాడు. ఫ్చ్...వాడి కోరిక తీరకుండానే పోయింది. అదిసరే రేపు నువ్వు లీవు పెడానన్నావ్ నీ సంగతేంటి?'' జగన్నాథం మీద సానుభూతి కురిపిస్తూనే అనుమానాస్త్రాన్ని ఎక్కుపెట్టాడు కాంతారావు.

"నన్నంత తక్కువగా అంచనా వేయకు'' అంటూ లీవ్‌లెటర్ పట్టుకుని రణరంగానికి బయలుదేరిన వీరుడిలా పోజిస్తూ బాస్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లాడు. వెళ్లినవాడు సెలవు శాంక్షన్ చేయించుకుని వెలిగిపోతున్న ముఖంతో బయటికొచ్చాడు. వాణ్ణి చూసి అంతా ఢంగైపోయారు.

జూనియర్ అసిస్టెంట్ జగన్నాథం సంగతి సరేసరి. ఎవరికీ అంత సులభంగా లీవ్ గ్రాంట్ చెయ్యని బాసు సుబ్బారావు అడగ్గానే కాదనలేకపోతున్నాడంటే అందరికీ ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలుగుతోంది. అసలు గుట్టు రాబట్టేందుకు స్టాఫంతా అతడి చుట్టూ చేరారు. "యూ ఆర్ గ్రేట్ సుబ్బారావ్! అనుకున్నది సాధించుకుంటావ్'' అంటూ అతడిని పొగడ్తలతో ముంచెత్తి సెలవు కోసం అతడు ప్రయోగిస్తున్న చిట్కా ఏమిటో చెప్పమని బ్రతిమిలాడారు. వాళ్ల మాటలకు ఉబ్బితబ్బిబ్బైపోయిన సుబ్బారావు "ఏముంది... సింపుల్..'' అంటూ అసలు రహస్యాన్ని బయటపెట్టాడు.

"ఛ, అదేం పని'' మొహం అదోలాపెడుతూ అన్నారంతా.

"అందుకే మీకెవరికీ సెలవు దొరకడం లేదు''



"ఏమనుకో నువ్వు చేస్తున్న పని బాగాలేదు'' అన్నారు కొలీగ్స్ ముక్తకంఠంతో.

* * *

ఎవరేమన్నా వినిపించుకుంటేనా? తన పని అవడమే ముఖ్యంగా భావించాడు సుబ్బారావు. ఇలా ఉండగా మొన్న అన్నయ్య నుండి ఫోనొస్తే గజగజ వణికిపోయాడు. లీవ్ కోసం కంగారుగా బాస్ రూంలోకి వెళ్లాడు.

"ఏమంటున్నావ్. మీ అమ్మగారికి సీరియస్సా...నేను నమ్మను'' ఉవ్వెత్తున లేచాడు ఆఫీసర్.

"నే చెప్పేది నిజమే సార్. మా అమ్మగారు చావుబ్రతుకుల్లో ఉన్నారని ఫోనొచ్చింది. రెండ్రోజులు సెలవులిప్పించండి'' కళ్లనీరు నింపుకుని ప్రాధేయపడ్డాడు సుబ్బారావు.

"సారీ మిస్టర్ సుబ్బారావ్. నువ్వెంత గ్లిజరిన్ రాసుకుని ఏడ్చినా నీ మాటలు నమ్మను. గత నెలలో మీ పిన్నమ్మ పోయిందని సెలవు పెట్టావు గుర్తుందా? ఆవిడ గుండ్రాయిలా ఎంతో ఆరోగ్యంగా ఉందని తెలిసింది నాకు. సెలవుకోసం నువ్వేటువంటి బాంబునైనా పేల్చగలవు''

"మీరన్నది నిజమే సార్. ఇదివరకు సెలవుకోసం ఎన్నో అబద్ధాలాడాను. కానీ ఇప్పుడు యదార్థం చెబుతున్నాను. నిజంగా మా అమ్మ పరిస్థితి బాగా లేదు. రెండ్రోజులు లీవ్ ఇవ్వండి...ప్లీజ్''

సుబ్బారావు మాటలకు బాస్ హృదయం వీసమంతైనా కరగలేదు. అదంతా నటనే అనుకుంటున్నాడు. చేసేదేంలేక బిక్క మొహం పెట్టుకుని బయటికొచ్చాడు సుబ్బారావు. ప్రప్రథమంగా సుబ్బారావును ఆస్థితిలో చూసిన స్టాఫ్ విస్మయానికి గురయ్యారు. ఓ ప్రక్క అమ్మకెలా ఉందోనన్న బెంగ. మరో వంక బాస్ సెలవులివ్వలేదన్న ఉక్రోషం. ఆ రాత్రి అతడికి కంటిమీద కునుకు లేదు. నిద్రలేమివల్ల కళ్ళు నిప్పుకణికలయ్యాయి. మర్నాడు పీక్కుపోయిన మొహంతో ఆఫీసుకొచ్చాడు. అప్పుడే బాస్ నుండి పిలుపు.

"మీ అన్నయ్యగారు ఫోన్ చేశారు. మీ అమ్మగారికి ఏమీ బాగోలేదట. వెంటనే బయల్దేరు. పదిరోజులు సెలవు శాంక్షన్ చేస్తున్నాను''

బాస్ మాట పూర్తికాకుండానే ఉరుకులుపరుగుల మీద వచ్చాడు. రాగానే అమ్మ చనిపోయిందన్న పిడుగులాంటి వార్త. 'తల్లి చివరిచూపునకు నోచుకోలేని స్థితి. దీనికంతటికీ తన వైఖరే కారణం' అని ఆలస్యంగా తెలుసుకున్నాడు సుబ్బారావు. ★